తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## ముంగిలిపట్టు వద్ద కారు దగ్ధం

### ప్రాణాలతో బయటపడ్డ నలుగురు



చంద్రగిరి, సెప్టెబర్ 15 ప్రభాతవార్త: పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి ముంగిలిపట్టు వద్ద కారు దగ్ధమైన ఘటన గురువారం చోటుచేసుకున్నది. వివరాలను పరిశీలిస్తే.. తిరుపతికి చెందిన టిటిడి ఉద్యోగి సాంబశివం కుటుంబ సభ్యులు హరీష్, మోహనమ్మ, సుబ్బమ్మ, బిట్టు చిత్తూరు నుండి తిరుపతికి వస్తున్నారు. ఈ క్రమంలో ముంగిలిపట్టు వద్ద కారు ఆగిపోయింది. కారుదిగి ఏమయ్యిందో గమనించేలోపే బానేట్ నుండి పొగలు రావడం, మంటలు చెలరేగడంతో హతాశులయ్యారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకుని మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. అప్పటికే దాదాపుగా దగ్ధమవడంతో పోలీసులు విచారణ చేపట్టారు. కారులో ప్రయాణిస్తున్న నలుగురు సురక్షితంగా బయటపడటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

## గణనాధుని సేవలో ఎండోమెంట్ ట్రిబ్యునల్ చైర్మన్

కాణిపాకం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:



ఏపీ ఎండోమెంట్ ట్రిబ్యునల్ చైర్మన్ హరినాధ్, సభ్యులు పద్మలు గురువారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ ఎంవి.సురేష్‌బాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహా ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, వెంట ఆలయ సూపరెండెంట్ కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.





వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర గురువారం ప్రశాంతంగా ముగిసింది. అమ్మవారి ఊరేగింపులో లక్షలాది మంది భక్తులు పాల్గొన్నారు. ప్రపంచ స్వర్ణ పతక విజేత బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి.సింధు అమ్మవారి సేవలో పాల్గొన్నారు. అదేవిధంగా తిరుపతి ఎంపి గురుమూర్తి అమ్మవారిని దర్శించుకున్నారు.

## అక్టోబర్ 2 నాటికి భూహక్కు పత్రాలు సిద్ధం

### సిసిఎల్ఏ ప్రధాన కార్యదర్శికి వివరించిన కలెక్టర్



సిసిఎల్ఏ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ హరినారాయణన్

చిత్తూరు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: జిల్లాలో భూముల రీ-సర్వే పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ప్రభుత్వం నిర్ణయించిన మేరకు అక్టోబర్ 2 నాటికి ఆయా గ్రామాల్లో భూ హక్కు పత్రాలు సిద్ధం చేస్తున్నామని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. సిపిఎల్ఏ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, బాబు అహ్మద్‌లు గురువారం భూ సర్వేపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ జిల్లాలో భూముల రీ-సర్వే కోసం రెండు కంపెనీలు డ్రోన్ సర్వేను నిర్వహిస్తున్నాయన్నారు. ఇప్పటి వరకు 550 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి అయ్యిందని, 66 గ్రామాల్లో 13 నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే 144 గ్రామాల్లో భూముల రీ-సర్వే వివిధ దశల్లో జరుగుతున్నాయన్నారు. మరో వారం రోజుల్లో 46 గ్రామాలకు సంబంధించి 13 నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ

## సంక్షేమ పథకాలపై తనిఖీలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో శ్రీనివాసరావు

తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలు అర్హులకే అందుతున్నాయా లేకుంటే అక్రమ మార్గంలో వెళుతున్నాయా అనే విషయాలపై గురువారం ఎన్‌ఐఆర్‌డీచే మూడు రాష్ట్రాల సోషల్ ఆడిట్ సభ్యుల సమావేశం జరిగింది. స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన సోషల్ జస్టిస్ అసెంబ్లీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఆర్వో శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు సామాన్య పేదలకే అందుతున్నాయన్నారు. ఏపీ, తెలంగాణ, ఒరిస్సా రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు ఎన్‌ఐఆర్‌డీ వారిచే చేపట్టిన పది రోజుల శిక్షణా కార్యక్రమం జరిగింది. ఏపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్నపలు సంక్షేమ పథకాలపై వారు సోషల్ ఆడిట్ చేసి వాటిపై సమీక్ష నిర్వహించడంతో ఇది భవిష్యత్ తరాలకు మంచి శుభపరిణామని డీఆర్వో తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ రిసోర్స్ సోషల్ జస్టిస్ ఎంపవర్మెంట్ సెల్ ప్రాజెక్టు ఆఫీసర్స్ ఉజ్వల్ కరంజిత్, వివిధ జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి చెన్నయ్య, తెలంగాణ ఆర్పీ అశోక్, ప్రిన్సిపాల్ ఈటీసీ శ్రీకాళహస్తి పద్మజ, శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్స్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## భక్తులకు సంతోషకరంగా బ్రహ్మోత్సవ ఏర్పాట్లు

### -మాఢవీధుల్లో పూర్తి సౌకర్యాలు

తిరుమల, సెప్టెంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:



ఈ ఏడాది తొమ్మిదిరోజులపాటు ఈనెల 27నుంచి జరగనున్న శ్రీవేంకటేశ్వరస్వామి వాహన సేవలను భక్తుల మధ్య జరిపిస్తున్నా అసౌకర్యం లేకుండా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి తెలిపారు. గత రెండేళ్ల ఆలయంలో ఏకాంతంగా జరిగిన బ్రహ్మోత్సవాలు ఈ ఏడాది మాఢవీధుల్లో నిర్వహిస్తున్నామన్నారు. సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భక్తులకు సౌకర్యాలు కల్పన, ఏర్పాట్లుపై గురువారం ఉదయం టిటిడి సివిఎస్ఓ నరసింహకిశోర్, సిఇ నాగేశ్వరరావు, ఎస్ఇ2 జగదీశ్వర్‌రెడ్డి, తిరుమల అదనపు ఎస్పీ మునిరామయ్య, విజిఓలు మనోహర్, బాలిరెడ్డి, సిఐలు పి.జగన్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్, టిటిడి సివిఎస్ఓలు అల్లం సురేంద్ర, సాయిగిరిధర్,ఇంజనీరింగ్ అధికారులతో కలసి ఆలయం ముందుభాగం, మాఢవీధులు పరిసరాలను నిశితంగా పరిశీలించారు.

## చంద్రప్రభ వాహనంపై శివపుత్రుని చిద్విలాసం



కాణిపాకం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఉభయదేవేరులతో కలసి విఘ్ననాధుడు చంద్రప్రభవాహనంపై కాణిపాకం పురవీధులలో ఊరేగుతూ భక్తులకు అభయహస్తమిచ్చారు. ఆలయంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల ప్రత్యేక ఉత్సవాలలో భాగంగా స్వామివారికి ఆదివారం చంద్రప్రభవాహన సేవను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి కాణిపాకం, చినకాంపల్లె, వడ్రాంపల్లె, కొత్తపల్లె, చిగరపల్లె, తిరువణంపల్లె, బొమ్మసముద్రం, అగరంపల్లె, పుణ్యసముద్రం, మారేడుపల్లె, సంతపల్లె, ఉత్తరబ్రాహ్మణపల్లె మరియు కారకాంపల్లె గ్రామాదుల హరిజన వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. వీరు ఉదయం మంగళ వాయిద్యాల నడుమ వరుస ఉభయం తీసుకురాగా అర్చకస్వాములు స్వామివారి మూలవిరాట్‌కు వేదపండితుల మంత్రోచ్ఛరణ నడుమ ప్రత్యేక అభిషేకాలను, పూజలను నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే ఉభయదారులు అష్టోత్తర శతకలశాలను ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయంలో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. తిరిగి రాత్రి గణనాధుడు ఉభయదేవేరులతో కలసి వేదపండితులు మం త్రోచ్ఛారణ నడుమ అర్చక స్వాముల పూజలందుకున్న అనంతరం రంగురంగుల విద్యుద్దీపాలు, వివిధ రకాల స్వదేశీ, విదేశీ జాతి పుష్పాలతో దేదీప్యమానంగా అలంకరించిన చంద్రప్రభ వాహనంపై అధిరోహించి మంగళవాయిద్యాల నడుమ కాణిపాకం గ్రామ పురవీధులగుండా ఊరేగుతూ భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎంవి.సురేష్‌బాబు, ఈఈ వెంకట నారాయణ, ఏసీ కస్తూరి, ఏఈఓలు విద్యాసాగర్‌రెడ్డి, రవీంద్రబాబు, హేమమాలిని, హరిమాధవరెడ్డి, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, శ్రీనివాస్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాబు, రమేష్, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డిలతో పాటు ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## గోల్డ్‌మెడల్ సాధించడం ఆనందంగా ఉంది...కార్తీక్‌రెడ్డి



కార్తీక్‌కు స్వాగతం పలుకుతున్న క్రీడాభిమానులు, కుటుంబసభ్యులు

రేణిగుంట సెప్టెంబర్ 15 ప్రభాతవార్త కామన్‌వెల్త్ కరాటేచాంపియన్‌షిప్‌లో గోల్డ్‌మెడల్ సాధించడం ఎంతో ఆనందంగా ఉందని కార్తీక్‌రెడ్డి అన్నారు. ఇంగ్లండ్‌లో జరిగిన కామన్‌వెల్త్ కరాటేచాంపియన్‌షిప్‌లో గోల్డ్‌మెడల్ సాధించి రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో గురువారం పలువురు క్రీడాభిమానులు, కుటుంబసభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఆయనపై పుష్పవర్షం కురిపించారు. ఎయిర్‌పోర్ట్ పోర్టుకోలో పాత్రికేయులతో మాట్లాడుతూ భారతదేశంతరపున కామన్‌వెల్త్ కరాటేచాంపియన్‌షిప్‌లో పాల్గొని బంగారుపథకం సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తనను ప్రోత్సహించిన కోచ్‌లకు, తల్లితండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. 10వ కామన్‌వెల్త్ కరాటే పోటీల్లో వివిధదేశాలకు చెందిన 40మంది పాల్గొన్నారన్నారు. తాను ఇంగ్లాండ్, స్కాట్‌లాండ్, సైప్రస్ దేశాలకు చెందిన వారితో తలపడ్డానన్నారు. ఫైనల్లో ప్రత్యర్థి గట్టిపోటీ ఇచ్చినప్పటికీ ఏమాత్రం అధైర్యపడకుండా దేశంకోసం ఆడుతున్నానన్న దృఢసంకల్పంతో ఆడి విజయం సాధించానన్నారు. తనవిజయాన్ని తానే నమ్మలేకపోయానని ఆతర్వాత ఎంతో ఆనందపడ్డట్లు తెలిపారు. అనంతరం ఆయన రోడ్డుమార్గంలో కుటుంబసభ్యులతో కలిసి బయల్దేరివెళ్లారు.


## గజానికో గుంత.. దారంతా చింత



రోడ్డుపై గుంతలో కుంగిపోయి ఇరుక్కుపోయిన వాహనం, గుంతలమయమైన రహదారి

ఓజిలి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త మండల కేంద్రమైన ఓజిలి నుంచి కురుగొండకు వెళ్లే మార్గంలో రోడ్డు బావులను తలపిస్తున్నాయి. ముఖ్యంగా ఓజిలి జామాయిల్ తోట సమీపంలో నాణ్యత ప్రమాణాలు లేకుండా నామమాత్రంగా వేసిన రోడ్డు మూన్నాళ్ల ముచ్చటగానే వేసిన వారంరోజుల్లోనే బావులను తలపిస్తున్నాయి. ఈ గుంటల ధాటికి వాహనదారులు ప్రమాదాల బారిన పడి ఆసుపత్రిలో చేరడం వంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో పలుమార్లు స్థానికులే రోడ్డుపై గ్రావెల్ పోసి చదును చేసిన సంఘటనలు ఉన్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని రోడ్డుకు శాశ్వత పరిష్కారం చూపాలని వాహనదారులు కోరుతున్నారు.

## శివయ్యసేవలో పివి సింధూ



పి వి సింధూకు వినాయకుని దారుశిల్పాన్ని అందిస్తున్న పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పివి సింధూ దర్శించుకున్నారు. ఆమె తిరుపతి జిల్లా వెంకటగిరిలో జరుగుతున్న జాతరకు హాజరైన తాను శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వచ్చానన్నారు. తాను ఎప్పుడు తిరుమలేశుని దర్శనానికి వచ్చినా శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకొనుటకు వస్తానని చెప్పారు. ఈ నేపథ్యంలో గురువారం ఆలయానికి వచ్చిన ఆమెకు దక్షిణ గోపురం వద్ద ఆలయ ఇఓ వికె సాగర్‌బాబు సారధ్యంలో వేదపండితులు, అర్చకులు స్వాగతం పలికారు. కాగా శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి తనయుడు బియ్యపు ఆకర్షరెడ్డి, బియ్యపు పవిత్రారెడ్డిలు స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్న ఆమెకు గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద ఆమెకు వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. కాగా పవిత్రారెడ్డి సారధ్యంలో ధర్మకర్తల మండలి మహిళా సభ్యులు కొండూరు సునితలు వినాయకుని దారు శిల్పాన్ని అందించారు.

## అన్నార్తుల ఆకలితీరుస్తున్న "అన్నాక్యాంటీన్లు"!

ప్రభాతవార్త-తిరుపతి: ప్రముఖ యాత్రాస్థలం, పుణ్యక్షేత్రం తిరుపతి నగరంలో తెలుగుదేశంపార్టీ పునరుద్ధరించిన అన్నాక్యాంటీన్‌లు అన్నార్తుల ఆకలితీరుస్తున్నాయి. సమాజమే దేవాలయం, పేదప్రజలే నా కుటుంబం అనే పిలుపునిచ్చిన స్వర్గీయ ఎన్టీరామారావు ఆశయంతో టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు ఒక ఉన్నతాశయంతో ప్రారంభించిన అన్నాక్యాంటీన్‌లను ఆ పార్టీ నేతలు సేవా భావంతో నడుపుతున్నారు. ఓటుకోసం కాదని, పేద, బలహీన వర్గాల జనం కోసం అని టిడిపి నాయకులు ఘంటాపథంగా చెబుతున్నారు. తిరుపతి ఇన్‌ఛార్జి ఎం.సుగుణమ్మ, పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహయాదవ్ పర్యవేక్షణలో రాష్ట్ర, జిల్లా, నగర పార్టీ కమిటీల నాయకులు డాక్టర్ బిఎల్ సంజయ్, సూరా సుధాకర్‌రెడ్డి, మబ్బుదేవనారాయణరెడ్డి, ఇనుకొండ సుబ్రమణ్యం, డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, వి.పుష్పావతియాదవ్, బుల్లెట్ రమణ, జెబి శ్రీనివాసులు, పార్లమెంట్ పార్టీ ప్రధాన కార్య దర్శి ఊట్లసురేంద్రనాయుడు, మీడియా కోఆర్డినేటర్ బి.శ్రీధర్‌వర్మ, టిడిపి కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ, ఊకా విజయకుమార్, రవినాయుడు, నగరకమిటీ అధ్యక్షుడు వట్టికుంట శంకరనారాయణ, ప్రధాన కార్యదర్శి మహేష్‌యాదవ్, దంపూరి భాస్కర్‌యాదవ్, ఆనంద్ బాబు యాదవ్, రామ్మూర్తిరాయల్, కుమారమ్మ, సింగంశెట్టి సుబ్బారామయ్య, రాము, సుబ్బుయాదవ్, విశ్వనాథం, రాజారాం, కన్నయ్య, యశోధ, మునిశేఖర్‌రాయల్ తదితరులు ఐక్యంగా ముందుకు నడుస్తూ తిరుపతి నగరంలో వారంరోజుల క్రిందట నుంచి తొలుత నగరపాలకసంస్థ కార్యాలయం సమీపంలో మొదలుపెట్టిన అన్యాక్యాంటీన్‌లను లీలామహల్‌కూడలి, ఎంఆర్‌పల్లి, స్విమ్స్ ఆస్పత్రి కూడలి, రుయా ఆస్పత్రి వద్ద ఇలా పలుచోట్ల అన్నాక్యాంటీన్‌లను తాత్కాలికంగా నిర్వహిస్తూ, రోజుకు పేదలకు, కార్మికులకు, రోగులకు, వారి సహాయకులకు నాణ్యతతో రుచికరంగా 5రూపాయలకే భోజనం అందిస్తున్నారు. పేదల ఆకలితీర్చే ఈ క్యాంటీన్‌లపై అధికార వైసిపి ప్రభుత్వం పేదల ఆకలిమంటలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. 5రూపాయలకే భోజనం అందించడం వెనుక సేవాబావం ఉందని, రాజకీయం కాదని టిడిపి నేతలు తెలిపారు. నిర్విరామంగా ఈ క్యాంటీన్‌లను కొనసాగించి ప్రజల ఆకలి తీర్చడమే తమ ధ్యేయమంటున్నారు. స్వయంగా పార్టీనేతలు రోడ్డుపైకి వచ్చి నిర్వహిస్తుండటంతో నిజంగా ఆకలితో అలమటించే పేదలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



